# ఇసం మింగిన మనిషి

పెద్దింటి అశోక్‌కుమార్

ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం - ఎ.పి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో రు. 5000/-ల నగదు బహుమతి పొందిన కథ

సోమవారం ఎల్లారెడ్డిపేట అంగడి. సుట్టూ ఇరువై ఊళ్లు మంది వస్తరు. మంగళవారం సోమవార్ పేటల. బుధవారం మాచరెడ్డి చౌరస్తల... బేస్తవారం ఎంకటపురంల... ఇట్ల సుట్టూ ఊరుకొక్కనాడు ఎల్ల అంగడి. వారంల వారం తిరుగుతది. అంగడికి అరువై తొవ్వలు. అయినా అందరి రాకడ పోకడ మా ఊరి మీది నుంచే!

ఎందుకంటరా? మా ఊర్లె ఈతవనముంది. వనం లేని ఊరు ఉండదనుకో! కొద్దిగ ఎక్కువ తక్కువ అంతే! మా ఊర్లె తక్కువనే చెప్పాలె. అయినా కల్లు రుచిగా ఉంటది. సుట్టూ పదూర్ల పెట్టు పెట్టింది పేరు.

'తింటే ఉడుకవెట్టిన అనుపకాయనే తినాలె. తాగితే మల్లరెడ్డిపేటల కల్లే తాగాలె' అంటరు కొందరు వేరే ఊరోల్లు. ఎక్కడన్నా మా ఊరి పేరు చెప్పితే ముందు గుర్తు జేసేది కల్లునే. మా ఊరోల్లు సుట్టరికానికి ఏ ఊరు పోయినా కల్లు సీస ముందట పెట్టి "పాము ఇసమసొంటి కల్లు తాగి నోళ్లు... మా కల్లు నచ్చుతదా?" అంటరు బయంగా.

ఎవలన్నా కొత్త మనిషి పరిచయమైతే ఊరి పేరు చెప్పంగనే కండ్లు పెద్దగ జేసి "మీ ఊర్లె కల్లు మంచిగుంటదట గదా!" అంటరు. తల ఊపితే సాలు. "ఒకసారి రావాలె. ఎప్పుడు రమ్మంటవు?" అని ఆశగా అడుగుతరు.

తిరుపతికి పోయిన మనిషి లడ్డు తినకుండ రావచ్చుగనీ మా ఊరికి వచ్చిన మనిషి కల్లు తాగకుంట పోడు. మల్లరెడ్డిపేట కల్లు తాగిత్తనని ఆఫీసుల్ల పనులు చేయించుకునేటోళ్లు ఎందరో ఉన్నరు. మా కల్లుకు కొందరు 'కంట్రీ మాల్' అని, కొందరు 'తీర్థం' అని పేరు వెట్టుకున్నరు.

మంచికో చెడ్డకో గని సిరిసిల్ల నేత బట్టలకు పేరెల్లినట్టు, నీలోజుపల్లె కూరగాయలకు పేరెల్లినట్టు, మా ఊరు కల్లుకు పేరెల్లింది. కొద్దిగ ఇబ్బందే అయినా ఆ పేరును మేము మోసుకత్తున్నం. మాకూ కొంత గర్వంగా కూడా ఉండేది.

ఇదంతా ఇప్పుడు ఎందుకు చెప్పుతున్ననంటే మొన్న మా కొండయ మామ వచ్చిండు. నేను సిరిసిల్లల ఉంటున్న గదా! వత్తెవత్తనే 'వారీ.. మనూరు పేరు పడిపాయె గదరా!' అన్నడు.

సంగతేమిటంటే అంగడి పోతున్న ఒక ఆడి మనిషి దుకాణంల కచ్చి కల్లు సీస కొనుక్కుని తాగిందట. సగం సీస తాగంగనే మొఖం మాడ్చిందట. "తూ... నీ యవ్వ. కల్లు ఇట్లుందేంది...? చెక్కరి నీళ్లు నయం. ఈ నీళ్ల కల్లుకే ఇంత పేరు అంత పేరా...? అదెట్లుంటదోనని ఆశ పడితి. దిక్కుమల్లె లగ్గానికి తాటిపండ్ల దప్పుడం అన్నట్టుంది' అని సగం సీసను పారవోసిందట.

అది మొదలు... కల్లు బాగలేదన్నోల్లే గాని మంచిగున్నదన్న మనిషి లేదట. ఇండ్లల్లకు పోయిన సీసలు వాప సచ్చినయట. వచ్చిన గిరాకి సగం మర్రిపోయిందట. పొద్దున మాపున జాతర సాగే ఎల్లమ్మ కట్టకు పురుగు పోత లేరట.

చెప్పుతూ చెప్పుతూ మామ "రెండు నెలలాయెరా... గౌండ్లోల్ల నాన్లు సల్లవడ్డయి. నీకు తెలిసిందనుకున్న... పదేండ్ల పేరు... పది రోజులల్ల పడిపాయె.." అన్నాడు.

ఇట్లెందుకైందంటే కల్లు కలిపే ఆశాలు పాణం బాగలేదట. ఆయె పాయె అన్నట్టే చేసిండట. గౌండ్లందరు గోసలోలె మొఖాలు వెట్టి "ఆశాలూ... ఎట్లరా మా బతుకు దెరువు" అంటే ఆశాలు కోడలు నీలవ్వ "సంపుండ్రిమరి... మీ పట్టుల మన్ను వడ. పట్టువడితిరి. పేగులు పుండ్లయి కార్యం కరిగి పోయిందట. మీరు సంపాదియించుకుంటిరి. మా కొంపలకు అగ్గి వెడితిరి" అని గయ్యిమని లేసిందట.

ఆశాలు బిడ్డ రేణ అడ్డమచ్చి ఏదో చెప్పబోతే నీలవ్వగాయి కెత్తుకుని "ముండ... ఐదారేండ్ల పొద్దు నూర్లకు నూర్లు తెత్తే లోపలేసుకున్నవు. ఇప్పుడు కూలవడితే నలుగురు నాలుగు రకాలు మమ్ములను అనవట్టిరి... నీ కడుపు గాలి కూల..." అని కొట్లాటవెట్టుకుందట.

రేణ కండ్ల నీళ్లు తీసుకుని "చిటికెడు కుంకుమకు పాసినదాన్ని. నాకు ఒక్క కొడుకు పెడాన పెట్టున కడుపు గాల అంటావు.. నా కలకల తలుగుతదీ సూడు" అని ఏడ్సిందట.

మామ పోతూ "ఆశాలు కోలుకున్నా కల్లు జెయ్యడురా.. అయిపాయె. ఆ కాండెమే ఎల్లపాయె. కడుపు నిండ కల్లు తాగే రోజులు రావు" అన్నడు.

ఇన్ని రోజులు ఊరూరు పొంటి కల్లు గురించే విన్నరు గనీ కల్లు వెనుకున్న ఆశాలు గురించి ఎవలకూ తెలువది. సాకలి ఆశాలు నాకు బాగా తెలుసు. బక్కపలుసని పాణం. బనీను ఇడితే పక్కబొక్కలు లెక్కవెట్టచ్చు. కోలమొఖం... మొఖం నిండ గడ్డం. ముందట రెండు ఎత్తు పండ్లు. వీడు పనేం చేస్తడని దౌటు పడి ఎవలూ కైకిలి గూడా పిలువరు.

ఆశాలుకు రేవు దగ్గరనే పొద్దు గూకుతుండె తెల్లారుతుండె. రేవు సుట్టూ ఈత చెట్లు. ఆకలైనప్పుడు చెట్ల దిక్కు పోతుండె. ఈదులు గీసే గౌండ్లకు సాయం జేత్తుండె. సాకెడు కల్లు వోత్తే కడుపు నింపుకుంటుండె.

ముల్లెడు బట్టలు తెచ్చి రేవు ఒడ్డున పారేసి పోయిండంటే ఉతికి ఎండేసి ముల్లె గట్టి కేకేసే దాకా రాకపోతుండె. ఆశాలు భార్య నింగవ్వ ఊర్లె అడుక్కచ్చిన బువ్వ ఇంత పిల్లలకు వెట్టి పిడికెడంత రేవుకు దెత్తుండె. ఆశాలు కోసం సూసీ సూసీ రెండు బుక్కలైతే తనే తింటుండె.

"ఏమాయె... పగటియాల్లన్న రావద్దా... నీ కల్లు పాడుగాను నిండేదా మండేదా..." అంటే "పని జేసేదానివి నువ్వు తినే. రెండు సాకలు దాగితే కడుపు నిండుతది. ఎనుకటోడు కల్లు దాగి కాకపోతే బువ్వ దిని కడుపు నింపుకున్నడా... ఎట్లనో ఎల్లదీసుకోవాలె. నా వంతుది పిల్లలకు పెట్టిరా" అంటుండె.

నింగవ్వ ఏ పనికైనా ఆశాలుకు అస పడకపోతుండె. 'ఈ సావు బతుకులోడు ఏం జేత్తడు. తొవ్వ నడిత్తె సొలుగుతడు. నూకితె నూరు జాగల వడుతడు' అని తిట్టుకుంట తనే చేసుకుంటుండె.

ఆశాలు ఈదుల్ల చెట్టుచెట్టుకు లొట్టి ఏత్తుండె. బీడికట్టలు, అగ్గిపెట్టెలు కొనుక్కత్తుండె. లొట్లన్ని జమ జేసి మండువాల పెడుతుండె. లొట్టి మూతికి తాళ్లు గడుతుండె. కొత్త ఈదులకు మొఖాలు చెక్కుతుండె. పొద్దంతా నూరు రూపాయల కైకిలోడు చెయ్యని పని ఆశాలు జేత్తుండె. అందుకని గౌండ్లు ఆశాలును వదిలేవాళ్లుగాదు.

ఏ చెట్టు కల్లు ఎట్లుంటదో ఆశాలుకు బాగా తెలుసు. ఈదుల్లకు వచ్చి కల్లు కొనుక్కపోయేటోళ్లు ఆశాలును అడుగనిదే లొట్టి ముట్టేటోళ్లు గాదు. తనకు ఇష్టమైనోళ్లకు మంచి కల్లు జాడ చెప్పుతుండె. ఇష్టం లేనోళ్లకు పుల్లటి కల్లు లొట్లను సూపిచ్చి కొనుక్కపొమ్మంటుండె.

ఎప్పుడన్నా మా బాపుతోని పొలం దిక్కు పోతుంటే మండువా దగ్గర ఆశాలు కనవడుతుండె. కల్లు కోసమే వత్తున్నమనుకొని "బావా.. పుట్ట మీది చెట్టు కల్లు ఫివరుంటది. తీసుకపో" అంటుండె. అప్పుడప్పుడు "మొగులు మెత్తవడ్డది. పుట్ట మీది కల్లు పులుపెక్కుతది ఎర్రమట్టల కల్లు మంచిగుంటది" అంటుండె.

మా బాపు కోపం ఆపక 'నీ పూట కుల్ల పీసునె గొడుదు. ఎప్పుడు కల్లు లోకమే నారా... ఇల్లు లేదు పిల్లలు లేరా... సాకెడు కల్లు కోసం సాకిరి జేత్తావురా' అని తిడితే నవ్వుతుండె.

ఆశాలు మునిమాపుననే ఈదుల్ల కత్తడు. చెట్లు తనవే అన్నట్టు చూసుకుంటడు. ఒకనాడు జన్నీదు లొట్టి మాయమయింది. వరుసగా దొంగ కోసం కావలిగాసిండ్రు గౌండ్లు. దొంగ దొరుకుతలేడు గనీ లొట్టి మాత్రం మాయమైతతంది. జన్నీదంటే వట్టిదిగాదు. కల్లు సార లెక్కనే ఉంటది. నాలుగు బుంగల నీళ్లు కలిపినా చిమచిమ అంటది.

"మీ నుంచి గాదు... నేను దొరకవడుతసూడు..." అన్నడు ఆశాలు.

చెట్టుకు లొట్టి కట్టే ముంద మడ్డిల తెల్ల తీటేర్ల పొడిని కలిపి పెట్టిండు ఆశాలు. దొంగ ఏ రాత్రి వచ్చెనో ఎప్పుడు తాగెనో గని కక్కుడు బైలువెట్టి ఒర్రె అంచుకే కూలవడిపోయిండు. తప్పు ఒప్పుకుని జురుమాన గట్టిండు. ఒకనాడైతే కల్లుదొంగలు ఆశాలును రాళ్లతో కొట్టిండ్రు. దెబ్బలు తలుగలేదు గనీ తలుగుతె పిడాత పాణమిడుత్తండె.

ఇంకో నాడు తిరిగి తిరిగి లొట్లేసి గడ్డ లీదు కల్లు తాగుతుండు. రుచిలో తెడా వచ్చింది. తాగుడు ఆపి 'గౌడా.. ఈదుకు దొంగలు వడ్డరు. నిన్నటి రుచి లేదు' అన్నడు ఆశాలు.

'చల్... కట్టిన లొట్టి కట్టినట్టే ఉంది. దొంగలెట్ల వత్తరురా' అన్నడు గౌడు. "నీకు తెలువది. గడ్డ లీదు భూమి మీదనే గదా ఉండేది. లొట్టి గూడా భూమి మీదనే నాయె. ఇడుసుకుని తాగి నీళ్లు వోత్తండ్రు" అన్నడు.

అన్నట్టుగనే రెండు రోజులల్ల దొంగను దొరుకవట్టిండు ఆశాలు.


"షెబ్బాస్‌రా... ఆశాలూ... నీ పెండ్లాం నీకు పనే రాదంటది. ఇంత మంచి పనోనివి' అని ఈపు తట్టిండ్రు గౌండ్లు. ఆశాలు పొంగిపోయాడు. పొద్దుమాపు ఈదుల్లనే పంటండు.

ఒకనాడు వాళ్ల దాంట్లనే దొంగను దొరకవట్టిండు ఆశాలు. దొంగ నాలె గీతలు గీత్తుంటే "ఇంటి దొంగ పాణగండం. ఇంత కంటే లత్తకోరు పని ఇంకోటి లేదు. మల్లా ఇంకొకసారి ఇట్ల చెయ్యకు" ఆశాలు అన్నాడు. ఆ తప్పును కడుపులనే పెట్టుకున్నడు.

ఈత చెట్లు డొక్కులైనంక వనాన్నీ యాడాది వదిలిపెడుతరు. తలకట్టు మూరెడు పెరిగినంక మొఖం చెక్కి ఉలి కుట్లు ఏత్తరు. అట్లా సాకలిరేవు వనాన్ని వదిలిపెట్టి దూరంగా ఉన్న వనంల గీత మొదలు వెట్టిండ్రు గౌండ్లు.

ఆశాలుకు కట్టమచ్చింది.

ఆశాలు కంటే ఎక్కువ, ఆశాలుతో పని చేయించుకున్న గౌండ్లకు కట్టమచ్చింది. అక్కడికి రమ్మని చెప్పిండ్రు. ఆశాలు



పోదామనుకున్నాడు. రెండు-మూడు రోజులు పోయిండు గూడా.

ఎన్నడూ నోరు ఇప్పని నింగవ్వ నోరు ఇప్పింది. 'ఇక్కడ దగ్గరుంది గదా పోయినవు. అటు దూరముంటది. పోయినవనుకో... ఇంట్లకు అడుగు వెట్టనియ్య' అన్నది కోపంగా.

కల్లుకు అలువాటైన పాణం. అదీ ఏరుకోలు కల్లు. పోలేక ఉండలేక ఆయాసపడుతుంటే 'దుకాణంలకు రారా... చేతుల కింద ఏదో పని జేత్తువు. ఇంత కల్లు తాగుదువు' పెద్ద గౌని కొడుకు అన్నడు. కొంత ఆసరైతదని అయినకు ఆశ.

ఆశాలు ఒప్పుకున్నడు. పొద్దుగల్ల రావాలె. అదో ఇదో సదురాలె. మగ్గిడో రెండు మగ్గులో తాగాలె. సాకరి యాల్లకు సాకరికి పోవాలె.

పొద్దంతా తనతోనే ఉంటుండని నింగవ్వ అడ్డు చెప్పలేదు. దుకాణంల కల్లును కలిపేది ఎల్లగౌడు. ఊరు పెద్దది. వచ్చే కల్లు చిన్నది. బుద్ధి పుట్టి అర్ధరాత్రి పూట కల్లు తాగుదామని వచ్చినా రెండు సీసలు దొరుకాలె. లేకుంటె పెండ్లా ఆలి మీదికెల్లి దిగరు.అందుకని నీళ్లు కలిపి కల్లు జెయ్యాలె. ఎప్పటికి స్టాకు ఉండాలె.

ఎల్లగౌడు చెయ్యి తిరిగిన మనిషి. పదేండ్ల నుంచి తనే కల్లు కలుపుతడు. మత్తు కోసంక్లోరల్ హైడ్రేట్‌ను కలుపుతడు. తెల్లని రంగుకోసం సిల్వర్ పొడర్‌ను, రుచి కోసం శాక్రిన్‌ను, చెక్కరిని, నురుగు కోసం కుక్కుడు గాయలను, ఈస్ట్‌ను కలుపుతడు. మొత్తం మీద నీళ్లను కల్లు జేత్తడు.

ఈదు గీసుడు నుంచి కల్లు మోసుడు దాక ఏ పనైనా చేస్తరు గనీ కల్లు కలుపుడంటే భయపడుతరు గౌండ్లు. సిహెచ్ నీళ్లల్ల కరుగకున్నా, చిటికెడు సిల్వర్ పొడర్ ఎక్కువున్నా దుకాణంల నుంచి శవాలు లేసుడే. అందుకని ఊరుకుపోయినా పల్లెకు పోయినా ఎల్లగౌడే కలుపాలె.

కల్లు కలిపినంక మొదాలు తాగేది ఆశాలే!

రెండు బుక్కలు మింగి ఆగి "గౌడా.. కొద్దిగ పులుపు ఎక్కువైందయ్యా!" అంటడు ఆశాలు. గౌడు పులుపు ఇరుగడానికి చక్రెన్ పోత్తడు.

ఇంకా రెండు బుక్కల్ల "మందు ఎక్కువైనట్టుంది. చేదు చేదు వత్తంది" అంటడు ఆశాలు. మందు ఇరుగడానికి గౌడు నీళ్లు కలుపుతడు.

'అరే... కడిగిన నీళ్ల లెక్కనే ఉంది. చిక్కగ లేనే లేదు' అంటడు ఆశాలు. ఎల్లగౌడు సిల్వర్ పొడరును కొద్దిగ కలుపుతడు.

ఇట్లా ఆశాలు సరే అన్ననాడు, ఊరంతా 'సరేరా' అంటుండ్రు. ఆశాలు ముక్కు ఇరిసిన్నాడు మనిషికో వంక తీత్తండ్రు. అట్లా ఆశాలు మీద గురి కుదిరింది ఎల్లగౌడుకు.

కల్లు ఒక నాడు పులుపు మీద దిగుతది. ఒకనాడు తీపి మీద దిగుతది. ఒక నాడు చెట్టు నుంచి నీరనే దిగుతది. ఒక నాడు చిక్కగ దిగుతది. మబ్బులు పడ్డనాడు వేరు. ఎండ కొట్టిన్నాడు వేరు. అందుకని ఏ రోజు కొలత ఆ రోజుదే! ఒక రోజు నాటి కొలత ఇంకో నాడు పనికిరాదు. అట్లా నెలా రెండు నెలల్లో ఆశాలు పనితనాన్ని దొరికిచ్చుకున్నడు ఎల్లగౌడు. అబ్బురపడ్డడు. "ఆశాలూ. నీది నాలికె గాదురా.. బంగారు తునుక. ఏది ఎంత తక్కువుందో రీడింగుతో సహ చెప్పేస్తది. ఇది నేర్చుకుంటే వచ్చే విద్య గాదురా. పుట్టుకతోనే రావాలె. ఎవలో కోటి కొక్క మనిషి ఉంటడు నీలాంటోడు" ఒకనాడు అన్నడు ఎల్లగౌడు, ఆశాలును మెచ్చుకుంటూ.

ఆశాలు ఉనికే లేని మనిషి. తనకు ఇంత

గొప్ప శక్తి ఉందని తెలుసుకొని పొంగిపోయిండు. ఇంకా తన బుద్ధికి పని జెప్పిండు. రుచిని పట్టి పట్టి చూసిండు. రుచి చూసుడును నాలుగు ముక్కలు చేసుకున్నడు. మొదటి మగ్గుకు కల్లు గట్టిదనం చూడాలె. రెండవ మగ్గుకు రుచిని చూడాలె. మూడవ మగ్గుక చిక్కదనం, వాసన చూడాలె. నాలుగవ మగ్గులో ఈ రుచులన్ని ఉన్నయా లేదా చూడాలె. అప్పుడు 'సరే' అనాలె.

ఆశాలు రుచి సూత్తండు. ఎల్లగౌడు కల్లు కలుపుతండు. రోజురోజుకు కల్లు మంచి గున్నదని గిరాకి పెరుగుతంది. గౌండ్లు, ఆశాలుకు భయపడుతున్నరు. ఎంతో విలువ ఇస్తున్నరు.

"సూసినవా... నేను కల్లు రుచి సూత్తుంటె లోకం మెచ్చుతుంది. ఇన్నేండ్లు ఎల్లగౌడు కలిపిండు. ఇరువై పెట్టెలు దాటలేదు అమ్మకం. ఈ నెలలనే ముప్పయి పెట్టెలు అమ్ముతున్నయి" ఒకనాడు భార్యతో గొప్పగా అన్నడు ఆశాలు.

నింగవ్వ "నీ కల్లుల మన్ను వడ... పిడాత సత్తవు. ఈదుల్ల కల్లు వేరు. దుకాణంల కల్లు వేరు. గుల్పారం కరుగక రవ్వంత ముద్ద కడుపులకు పోయిందనుకో... పిట్టపిల్ల లెక్క నోరు దెరుత్తవు" భయపెట్టింది.

ఆశాలు భయపడ్డడు. దుకాణంలకు మానుకున్నడు. అలువాటయిన పాణం. కల్లు దిక్కు గుంజుతంది. ఆకలిని తట్టుకోలేక పోతున్నడు. పిల్లలకు పోను మిగిలిన నాలుగు బుక్కల పగలో పొద్దున్నో సాలుతలేదు.

అక్కడ ఎల్లగౌడు గూడా ఆగమైతండు. కల్లు అందాజ తెలువడం లేదు. "ఏమైంది గౌడా... నిన్న మొన్న కల్లు కమ్మగుంటుండె. ఒకటి తాగుతమని వచ్చి మూడు తాగుదుంటిమి. ఇప్పుడు ఒక్క సీసనే నోట్లెకు పోతలేదు" అంటున్నరు గిరాకి.

ఇట్ల గాదు అట్ల గాదని ఎల్లగౌడు నెలకు వంద రూపాయల జీతమిత్తనన్నడు. వంద అనంగనే నింగవ్వ కండ్లు మెరిసినయి.

"పోతె పో.. నిన్ను పగ్గాల మీద ఆపుడుంది. కల్లు లేకపోతే నువ్వు బతుకుతవా...? తాగువోతువైతివి" తప్పును ఆశాలు మీదనే ఏసి చెప్పింది నింగవ్వ.

ఆశాలు నోరు తెరువలేదు. జీతం కుదిరిండు. కల్లు కుదిరింది.

'శబాస్‌రా ఆశాలూ' అంటే బండి కమ్మును ఎత్తుకుంటుండు. పొద్దున పోయిండంటే కల్లు సీసలు బండి కెత్తేదాక బండసాకిరి జేత్తండు. జీతం ఇచ్చిన్నాడు మాత్రం వంద నోటును గర్వంగా తెచ్చి భార్య చేతులవెడుతండు.

పరిగడుపున కల్లు తాగుడు... అదీ మందుకల్లు. జరమచ్చినా కడుపు నొచ్చినా చాత గాకున్నా తాగుడు. రుచి దొరుకని నాడు కొద్దిగ ఎక్కువనే తాగుడు.

ఒకసారి కడుపు మండుతుండె. ఒకసారి పేగులు వడివెడుతుండె. ఒకసారి తింపుతుండె. కక్కత్తుండె. క్లోరోఫారం ఎక్కువైన్నాడు కడుపుల పేగులు బగ్గుమంటుండె. అన్నీ కుదిరే దాక రుచి చూసేసరికి కల్లుతో కడుపు నిండుతుండె. అయినా తమాయించుకున్నడు ఆశాలు.

ఆశాలు సాకరికి పోయినా పోకున్నా నింగవ్వ ఎదురు సూత్తలేదు. కొడుకును బిడ్డను పట్టుకుని పని ఎల్లదీసుకుంటుంది. 'దుకాండ్ల ఉంటవు గదా.. సీసనో రెండు సీసలో పైసలు గిట్టిచ్చుకత్తె తప్పా... వాళ్లు వెయిలు ముల్లె గట్టుకుంటుండ్రు' అంటుంది ఎప్పుడూ. ఆశాలు ఎప్పుడూ నయా పైస ముట్టలేదు.

నాలుగైదేండ్లు గడిచింది. ఆశాలుకు ఇంకా పట్టు దొరికింది. కల్లు రుచి ఊరూరూ ఎలిసి పారింది. ఈత వనం తక్కువున్నా ఇంత కల్లు ఎక్కడిదన్న డౌటు ఎవలకు రాలేదు. ఎక్సైజ్ వాళ్లకు వచ్చి మొదట్లో దాడులు చేసి కేసులు పెట్టిండ్రు. లైసెన్సులు రద్దు జేసిండ్రు. వారే ఇండ్లల్లకు లైసెన్సులు తెచ్చి ఇచ్చిండ్రు.

**కల్లు ఒక నాడు పులుపు మీద దిగుతది. ఒకనాడు తీపి మీద దిగుతది. ఒక నాడు చెట్టు నుంచి నీరనే దిగుతది. ఒక నాడు చిక్కగ దిగుతది. మబ్బులు పడ్డనాడు వేరు. ఎండ కొట్టిన్నాడు వేరు. అందుకని ఏ రోజు కొలత ఆ రోజుదే! ఒక రోజు నాటి కొలత ఇంకో నాడు పనికిరాదు.**

ఈ ఐదేండ్లలో ఆశాలు బిడ్డ లగ్గం జేసిండు. అదలు బదలు జేసి అదే ఇంట్ల నుంచి కోడలును తెచ్చుకున్నడు. పండుగులకు కోడలును పంపితెనే బిడ్డ వస్తుంది. కొడుకు పోతెనే అల్లుడత్తండు. ఇంట్ల కతలేవీ ఆశాలుకు తెలువయి. పగటి యాల్ల దాకా నిమ్ము మీదుంటుండు. పొద్దు గూకేదాక కడుపు నొప్పి మీదుంటుండు.

ఒక నాడు ఆయాసం ఎక్కువైంది. దుకాణంలకు పోలేదు ఆశాలు. ఊరు కింది మీదయింది. అడుగక ముందే ఆశాలు జీతం మూడు వందలు పెరిగింది. అయినా ఆశాలు ఆయాసంతో కల్లు ముట్టలేదు.

గౌండ్లు ఇంటికచ్చి నింగవ్వను కలిసిండ్రు బతిమిలాడిండ్రు.

"ఏందయ్యో.. మీరిచ్చేది నిండుతందా మండుతందా.. పక్క ఊరోళ్లు వచ్చిండ్రు ఇంకా ఎక్కువనే ఇత్తనన్నరు" రాయి ఇసిరింది నింగవ్వ.

గౌండ్లు గజ్జుమన్నరు. తొక్కుకుని తొక్కుకుని ఇంకో యాభై పెంచిండ్రు. అయినా ఆశాలు ఒప్పుకోలేదు. 'కూలికి ఇసం తాగుతనా' అనుకున్నడు.

"నెలకు మూడు వందల యాభై, ఏం జేత్తె రావాలె. ఇంట్ల కూసుంటె ఎట్ల బతుకుతం. కైకిలి చాత గాదాయె. అక్కడ మొద్దులు గొట్టుడా మొరండ్లు నరుకుడా. అద్ద గంట పని గాదు" కోపంగా అన్నది నింగవ్వ.

ఆయాసపడుతూ చెప్పలేక చెప్పలేక "పరిగడుపున కల్లు తాగితె కడుపు నొత్తందే.. కల్లు మీద ఇంత తిండి ఉండాలె" అన్నడు ఆశాలు.

"లచ్చల కోట్ల మంది తాగుతుండ్రు. వాళ్లకు ఏమైత లేదు. నీకెందుకు నొత్తది. దవఖాన్ల సూయించుకునిపో" నింగవ్వ అన్నది కోపంగా.

"వాళ్లు రోజూ తాగరు గదా.. తాగినా పరిగడుపున రోజూ ఎందుకు తాగుతరు?" అన్నడు.

"కోతనా... మోతనా..? మూడు ముంతల కల్లు తాగుడే కట్టమా..?" కొడుకు ఎత్తి పొడిచిండు.

"మా నాయినైతెనా... ఇంకో యాభై ఎక్కువ జేసుకుని వాడిక పెట్టుకుంటుండె" కోడలు దెప్పి పొడిచింది.

ఆశాలు ఇంక ఆగలేదు. పొద్దున లేత్తెనే దుకాండ్లకి పోయిండు. కల్లు రుచి కుదిరింది. పగటియాల్లన సాకరికి పోయి కొడుకు రాజంతో 'అయ్యా... దుకాణంల కుదిరినరా.. జీతం యాభై ఎక్కువ జేసుకున్న' అన్నడు విరక్తిగా.

యాడాది రెండేండ్లు గడిచింది. ఇయ్యమిచ్చిన ఇంట్ల నుంచి ఇయ్యం తెచ్చుకోవద్దంటరు. ఆశాలు ఇంట్ల నిత్తె కయ్యిమే మొదలయింది. ఈ ఇంట్ల దెబ్బ కొడితే ఆ ఇంట్ల నాద మెల్లుతుంది. ఇక్కడ కోడలు కంట్లె నలుసు పడితే అక్కడ బిడ్డ కంట్లె నీళ్లు గారుతున్నయి. కోడలు ఒకటికి పది ఎక్కించి తల్లికి చెబుతంది.

కొడుకు, కోడలు సాకరికి వోతే సంసారం ఎల్లక నింగవ్వ కైకిలి వోతంది. కొట్లాటలు పెద్దగైనయి. కోడలు ఏరు వడ్డది. అక్కడ బిడ్డకు ఏరు వోసిండ్రు.

"మీకు చాద గాదు. ఊరు ఉతుక్కోండ్రి. రెక్కలున్న కొడుకు. వాడు కైకిలి చేసుకుంటడు" పెద్దమనుషులు అన్నరు నింగవ్వతో.

నింగవ్వ నిజమే అంది. ఆశాలే ఒప్పుకోలేదు. "వద్దు వద్దు. ఒంటి రెక్క పాణం. కైకిలేం జేత్తడు. నాకింత జీత మత్తంది. చాతనైన నాడు మేమే కైకిలి చేసుకుంటం. వాన్నే ఊరు ఉతుక్కొమ్మను" ఆశాలు అన్నాడు. కొడుక్కు ఊరు ఇచ్చిండు. తను ఏరు వండుకున్నడు.

అక్కడ ఇయ్యంపుడు అట్లా అనలేదు. కొడుకును కైకిలి చేసుకొమ్మని తనే ఊరు తీసుకున్నడు. అక్కడ బిడ్డ, ఇక్కడ అవ్వ ఎదురైన కూలినాలి చేస్తండ్రు. ఒకనాడు నింగవ్వ కోత కైకిలి పోతంది. ఒడ్డు జారి కింద పడ్డది. పడుడు పడుడే ముక్కు దూలం రాయికి గుద్దు

కుంది. పిడాత పాణమిడిసింది.

ఆశాలు ఒంటరి పక్షి అయిండు. దుకాణం లనే పొద్దుగూకుతంది తెల్లారుతంది. తిండి గూడా తింట లేడు.

"నాయినా! ఒక్కని పాణానికి వండుడెందుకే! నాతో నువ్వు తిను" అని కొడుకు అనలేదు. కోడలు అనలేదు. పైగా వచ్చిన జీతం ఏం జేస్తున్నవని లెక్కలు అడుగుతండ్రు.

ఆశాలుకు కడుపుల నొప్పి ఎక్కువైతంది. ఇంతకు ముందు కొద్దిగ సేపు నొత్తుండె. ఇప్పుడు పొద్దంత నొప్పే! మానుకుందామనే లోపే మల్లో దెబ్బ తగిలింది.

తలిగిన కాలికే దెబ్బ తలిగినట్టు... ఇంకో దెబ్బ బడ్డది. టాక్టర్ పనికి పోతున్న అల్లుడు జారి పయ్య కింద పడ్డడు. ఎనుక పయ్య ఎక్కి దిగింది.

బిడ్డ సంటి పిల్లతో ఒంటిదైంది. గుడ్డుకు కుంచెడు నీళ్లు వడిపింది. అట్లనో ఇట్లనో మరిచి ఆరు నెలలు ఉంది గనీ అత్తమామ నెగుల నియ్యలేదు. వచ్చి తండ్రి పంచన చేరింది రేణ.

అప్పుడు ఆలోచించిండు ఆశాలు. 'నొప్పి నొప్పి అని చేతుల పని మానేత్తే బిడ్డకు బరువు గానా?' అనుకున్నడు. 'నా కడుపు జూసే పెండ్లామే పోయింది. నేనేం బతుకుడు' అనుకున్నడు. మనసు ఇరుసుకున్నాడు.

బిడ్డను, మనుమన్ని చేతవట్టుకున్నడు. వాళ్ల కొక నీడ చేసిండు. రోజూ విషాన్ని మింగినట్టు కల్లును మింగుతున్నడు. దాని రుచిని తేల్చి చెప్పుతున్నడు. ఎన్నడూ ఎవలతోని మాట రాకుండా చూసుకుంటున్నడు. కాలంలో మార్పులు వచ్చినట్టే మందుల్లో మార్పులు వచ్చినయి. క్లోరల్ హైడ్రేట్‌కు బదులు క్లోరోఫారం వాడుకల కచ్చింది. ఇంకా చిక్కదనం కోసం చెక్కలను దంచి పోత్తన్నరు. కొన్ని చెక్కలను దంచి మడ్డిలోనే కలుపుతున్నరు. గిరాకి పెరిగిన కొద్ది కల్లు ఎక్కువ జేత్తండ్రు. గాటు మందులను కలుపుతండ్రు.

అయినా అన్ని రుచులను పట్టి చూస్తన్నడు ఆశాలు. రెండు బుక్కలు ఎక్కువైనా సరే! మింగి రుచిని చెప్పుతున్నడు. కల్లుకు పదూర్ల పేరును తెచ్చి పెడుతున్నడు.

ఆశాలు బిడ్డ దగ్గరనే ఉండుడు, కోడలు నీలకు నచ్చలేదు. "సూసినవా... ముసలోడు.. ముల్లె గట్టి బిడ్డకు ముడెత్తండు. మనకు ఒక్క పైస ఇత్తలేడు" కోడలు నీల మొత్తుకుంది. రాజం చెవులూపుతండు గనీ తండ్రిని అడుగుత లేడు.

ఒకనాడు నీలనే ఆశాలు దగ్గరికి పోయింది. రేణతో లొల్లి వెట్టుకుంది. మామను మా ఇంటికే తోలాలని జిద్దు జేసింది.

"నాయినా.. నా బాకీ ఎట్లుంటి అట్లయితది. అది నన్ను ఉంచది. నువ్వు వాళ్లింటికే పోయే..." ఏడుత్తూ అన్నది రేణ.

"అది అట్లనే అంటది బిడ్డా... అశిర పిల్లవు. ఒంటిగ ఎట్ల ఇడువాలె బిడ్డా... ఏం చేసుకుంటదో చేసుకోని" బాధగా అంటూ బిడ్డను ఓదార్చిండు ఆశాలు. ఎవలు ఏమన్నా పట్టించుకుంట లేడు ఆశాలు. వత్తె ఇంటి దగ్గరుంటుండు. పోతే దుకాణం లుంటుండు.

రెండు-మూడేండ్లు గడిచాయి. నీల కారాలు మిరాలు నూరుతనే ఉంది. రాజంను ఎగేత్తనే ఉంది. ఒకసారి నేను ఊరికి పోయినప్పుడు వదినె మరుదండ్ల మధ్య కొట్లాట నడుత్తంది. రాజం గూడా తండ్రిని తన వద్దకు రమ్మని బలవంతం చేత్తండు.

ఈ మధ్య జరిగిన సంగతి ఏమిటంటే ఆశాలుకు కడుపు నొప్పి తిరుగ వెట్టిందట. ఒకనాడు దుకాణంలకు పోతనని మధ్యలనే అడ్డం బడ్డడట. కొడుకు, కోడలు ఎవలూ రాలేదట.

కొట్టుకుంట మొత్తుకుంట రేణ తండ్రిని దవాఖానకు తీసుకపోయిందట. డాక్టర్ చెయ్యి వట్టి సూత్త సూత్తనే కల్లు తాగుతడా అని అడిగిండట. ఇక ముందు తాగితే బతుకడని చెప్పిండట.

'పేగులు పల్సనైనయి. పేగుకు రంధ్రం బడ్డది. ఆపిరేషన్ చెయ్యాలె.' అని ఆపిరేషన్ చేసిండట. విషయం తెలిసి మనుసు ఆగలేదు. ఆశాలును సూడాలని ఊరికి పోయిన.

**ఆశాలు ఇంక ఆగలేదు. పొద్దున లేత్తనే దుకాండ్లకి పోయిండు. కల్లు రుచి కుదిరింది. పగటియాల్లన సాకరికి పోయి కొడుకు రాజంతో 'అయ్యా... దుకాణంల కుదిరినరా.. జీతం యాభై ఎక్కువ జేసుకున్న' అన్నడు విరక్తిగా.**

ఆశాలు దవాఖానల ఉన్నడు. బిల్లు పది వెయిలు దాటింది. బిల్లు గట్టి తీసుకపొండ్రి అని డాక్టర్ అంటున్నడు.

"నా దగ్గర ఏముందన్నా... ముండమోసి వచ్చిన. ఉచ్చపీతి ఎత్తిపోత్తన్న. పది వెయిలు యాడ తేవాలె" రేణఏడుత్తంది.

"నా దగ్గరున్నడా... ఇన్ని రోజుల పైసలు ఏం జేసిండు. అవి తెమ్మను. తోలుకత్త" భార్య ఎగేత్తే రాజం అంటుండు.

ఇట్లనే వారం పది రోజులు దాటినయి. ఆశాలు దవఖాన్లనే మిడుకుతుండు. పోయినోల్ల కల్లా ఏడుత్తండు. గౌండ్లను బతిమాలి కాళ్లు మొక్కుతండు. ఎవలూ నోరెత్తుతలేరు. పైస గాదు రెండు పైసలుగాదు. పది వెయిల ముచ్చటనాయె. ఎవలూ ముందుట పడుత లేరు.

సూసీ సూసీ కులసంగమే ముందట వడ్డది. రాజంను పిలుసుకున్నరు. "వారీ... అది ఆడిపోరి. తలకు మాసి వచ్చింది. దానికే తినపోతే తిండిలేదు. నువ్వు మొగకొడుకువు. అప్పయినా అంశమైనా నీ బాధ్యతుంటది. పది వెయిలు గట్టి తెచ్చుకుంటవా తెచ్చుకో. లేకుంటే మేమే కట్టి తెత్తము. ఇంటికి బుక్కెడు పెట్టి పొట్ట గడుపుతము. నువ్వు నాయినా అని రావద్దు. సచ్చిన్నాడు సట్టివట్టద్దు అగ్గిముట్టద్దు" అన్నరు.

భార్యాభర్తలు ఏమనుకున్నరో... రెండు రోజులల్ల ఆశాలను తెచ్చి ఇంట్లేసుకున్నడు రాజం. ఎంట రేణవత్తే నా యింట్ల అడుగు వెట్టద్దు అని వాకిట్ల నుంచే గెదిమింది నీల.

"బిడ్డా... ఒక్క చెల్లెరా... పాపం.. మంచిగ చూసుకోవాలెరా..' అని ఆశాలు సదిరి చెప్పబోతే 'అదా.. అదినాకు చెల్లె గాదు. పాలిది' అని గయ్యిమన్నడు రాజం.

రెండు నెలలు గడిచింది. మల్లీ ఒకనాడు మామ వచ్చిండు. 'వత్తవత్తనే' మనూరి పేరు మల్లా నిలవడ్డదిరా" అన్నడు. నాకు పాణం జల్లుమంది.

'కల్లు తాగితే ఆశాలు బతకడు గదా' అడిగిన.

"తాగకపోతే గౌండ్లు బతుకరు. రాజం బతుకడు గదా..." మామ అన్నడు. "... నీల బతుకనియ్యది."

ఇంటికి తెచ్చిన మరునాటి నుంచే నీల "సంపయించిననాడు మంది బొందకు వెడితివి. ఇరుగవడ్డనాడు నా మెడకు వడితివి" అని పోరు వెట్టిందట. సగం పైసలు కట్టుమని రేణను కొట్టిందట.

దీనికి తోడు ఏడువందలిత్తము... వెయ్యి ఇత్తము... అని గౌండ్లు, కల్లు పెంచుతుండ్రట. అది చూసి నీల పిచ్చికుక్కయిందట. రాజంను కుక్కను జేసిందట. వెయ్యి... వెయ్యిత్తరట. అని కలువరిల్లిందట. ఆ తిక్క ఈ తిక్క రేణ మీద మొగని మీద తీత్తందట.

ఇంకో నెలక ఊరికి పోయిన. ఇప్పుడు ఊరంతా ఆశాలునే తప్పు వడుతండ్రు.

"అవునయ్యా... అలువాటైన పాణం. కల్లు తాగంది నేనుండ లేనుగదా" అందరికి చెప్పినట్టే నాకు చెప్పిండు ఆశాలు.

నాకు కండ్లల్ల నీళ్లు తిరిగినయి. "ఆశాలూ.. నువ్వు మామూలు మనిషివి గాదురా! ఇసంను గొంతుల దాసుకున్న శంకరునివి" అనుకున్న. సూసీ సూసీ కులసంగమే ముందట వడ్డది. రాజంను పిలుసుకున్నరు. "వారీ... అది ఆడిపోరి. తలకు మాసి వచ్చింది. దానికే తినపోతే తిండిలేదు. నువ్వు మొగకొడుకువు. అప్పయినా అంశమైనా నీ బాధ్యతుంటది. పది వెయిలు గట్టి తెచ్చుకుంటవా తెచ్చుకో. లేకుంటే మేమే కట్టి తెత్తము. ఇంటికి బుక్కెడు పెట్టి పొట్ట గడుపుతము. నువ్వు నాయినా అని రావద్దు. సచ్చిన్నాడు సట్టివట్టద్దు అగ్గిముట్టద్దు" అన్నరు.